కొడంగల్, డిసంబర్ 26: మండలంలోని చిన్ననందిగామ గ్రామానికి చెందిన మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గతంలో మల్లేష్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన మల్లేశ్‌కు నరేందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భీములు పాల్గొన్నారు.

దుద్యాల స్టేషన్ ఎస్ఐగా భరత్‌రెడ్డి బాధ్యతలు

దుద్యాల ఎస్ఐగా బాధ్యతలు చేపడుతున్న భరత్‌రెడ్డి

కొడంగల్, డిసెంబర్ 26: దుద్యాల మండలంలో నూతనంగా మంజూరైన పోలీస్‌స్టేషన్‌ను కలెక్టర్ ప్రతీక్‌జైన్, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం ప్రారంభించారు. అనంతరం ఎస్ఐగా భరత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కొత్త మండలంలో నూతనంగా ఏర్పాటైన పోలీస్‌స్టేషన్‌కు మొట్టమెదటి ఎస్ఐగా భరత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడం పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాలాల, డిసెంబర్ 26: తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం ఊరెంటితండా వద్ద వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ ఆదేశాల మేరకు పోలీసులు గురువారం గస్తీ నిర్వహించారు. రాంసింగ్‌తండా నుంచి ఊరెంటితండా వైపు అనుమానాస్పద రీతిలో వెళుతున్న వ్యక్తులను తనిఖీ చేయగా రెండు ప్లాస్టిక్ బాటిళ్లలో నాలుగు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. రాంసింగ్‌తండాకు చెందిన రాథోడ్ రవి(38), చవాన్ సోనీబాయ్(54)గా వీరి గుర్తించి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాండూరు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ బాలగంగాధర్ తెలిపారు.

కారు, లారీ ఢీ: ఆరుగురికి తీవ్రగాయాలు

యాలాల, డిసెంబర్26: ఎదురెదురుగా వస్తున్న కారు, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలైన ఘటన తాండూరు మండలం అంతారం సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....తాండూరు పట్టణానికి చెందిన శ్రీనివాస్ (46) కుటుంబ సభ్యులు జహీరాబాద్‌లో జరిగిన వివాహవేడుకకు కారులో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో అంతారం గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆరుగురికి గాయాలు కాగా హుటాహుటిన తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా అనిత(36) పరిస్థితి విషమంగా ఉండండతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా ఐదుగురు బాలమణి(60), శ్రీనివాస్(46), అశ్విని (34), సమీక్ష (12), షణ్ముఖ ప్రియ(11) లకు చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్ రాంరెడ్డి

బషీరాబాద్, డిసెంబర్ 26: సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి బాట పట్టిందని నవాంద్గీ సహకార సంఘం చైర్మన్ అల్లాపురం వెంకట్‌రాంరెడ్డి అన్నారు. గురువారం సహకార కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సీఈవో బండెప్ప సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పలు గ్రామాలకు చెందిన సభ్యులు సహకార సంఘం అభివృద్ధిపై, రైతుల సమస్యలపై మాట్లాడారు. రైస్ మిల్ ఈ సీజన్‌లో అందుబాటులోకి తీసుకొస్తే రైతులకు మేలు జరిగేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే కాశీంపూర్ గ్రామంలో సంఘం తరపున ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు డబ్బులు ఖర్చు పెట్టి చివరి నిమిషంలో ఐకేపీ సంస్థకు అప్పగించారు. ఖర్చు పెట్టిన డబ్బులను ఎవరి నుంచి రాబడతారని ఆశోక్ చంద్ర గౌతమ్ ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం చైర్మన్ మాట్లాడుతూ సభ్యుల సహకారంతో సంఘానికి మంచి పేరు తేవాలని ఈ ఐదు సంవత్సరాలు పని చేసినట్లు చెప్పారు. ఖర్చుపెట్టిన ప్రతి పైసాకు లెక్క ఉందని తెలిపారు. మీ సహకారంతోనే సంఘాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చామన్నారు. రూ. 3 కోట్లతో రైస్ మిల్, గోదాంలు, పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఎక్కడ కూడా దుర్వినియోగం చేయకుండా, సంఘాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామన్నారు. వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇది ఆఖరు పాలక వర్గ సమావేశం, సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. వచ్చే నెలలో వ్యవసాయ శాఖ, ఇతర మంత్రుల చేత రూ. 3 కోట్ల పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సహకార సంఘం ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ఆశోక్‌చంద్రగౌతమ్, రంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, గోపాల్, అనసూయ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం : స్పీకర్

వికారాబాద్, డిసెంబర్ 26: ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షణా ఉద్యోగులు చేస్తున్న ఆందోళన గురువారం 21వ రోజుకు చేరుకుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వారి వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 న సమగ్ర శిక్షా ఉద్యోగుల రాష్ట్ర కమిటీ సభ్యులతో నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడించి కేబినెట్ సమావేశంలో చర్చించి కనీసం పేస్కేల్ అమలు చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

130 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పూడూరు, డిసెంబర్ 26: పేదలకు సేవ చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నదని డాక్టర్ ఎఎస్ నారాయణ తెలిపారు. గురువారం పూడూరు మండలం హైదరాబాద్ బీజాపూర్ హైవే రోడ్డు పక్కనే ఉన్న శ్రీ షిర్డీ సాయి మందిరంలో డాక్టర్ నారాయణ ఆధ్వర్యంలో కంటి, దంత, ఇతర రోగులు సుమారు 130 మం దికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. కంటి సమస్యతో బాధప డుతున్న వారిని శస్త్ర చికిత్సలకై హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు.

ఎర్రమట్టి వాహనాలు సీజ్

నవాబుపేట, డిసెంబర్ 26: ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నుంచి ఎర్రమట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను నవాబుపేట పోలీసులు సీజ్ చేసిన ఘటన గురువారం చిట్టిగిద్ద గ్రామంలో జరిగింది. ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎర్రమట్టిని తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఘటన స్థలానికి చేరుకుని రెండు వాహనాలను కూడా పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగిస్తామన్నారు. ట్రాక్టర్ ఓనర్ అండ్ డ్రైవర్ చిట్టిగిద్ద గ్రామానికి చెందిన అయ్యగళ్ల సత్యం, అదే గ్రామానికి చెందిన కొండారెడ్డి సుధాకర్‌రెడ్డికి చెందిన జేసీబీ డ్రైవర్ ఎండి పాషా అని తెలిపారు.

రేపు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వికారాబాద్, డిసెంబర్ 26 : ఈ నెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీల విలీన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మహేందర్ కోరారరు. గురువారం వికారాబాద్‌లో ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో వివిధ కారణాల రీత్యా విడిపోయిన న్యూ డెమోక్రసీ పార్టీలు నేడు విలీనం కావాలనుకోవడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ప్రభావతి, శ్రీకాంత్, గీత, అశోక్ పాల్గొన్నారు.

జీవన శైలిలో మార్పులతో ఆరోగ్యం మెరుగు

యాలాల, డిసెంబర్26: పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడంతో పాటు జీవన శైలిలో కొన్ని మార్పులు చేసుకున్నట్లయితే గుండె సమస్యల నుంచి బయట పడవచ్చని హైదరాబాద్ హైటెక్‌సిటీ మెడికోవర్ హాస్పిటల్ ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ దయ వాస్వని అన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని హోటల్ హిమాలయలో యువ జాగృతి అధ్యక్షుడు పర్యాద రామకృష్ణ, ఐఎమ్ఏ తాండూరు అధ్యక్షుడు జయప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో యువతలో గుండెపోటుతో ఆకస్మిక మరణాల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. అతిగా తినడం అనర్థాలకు మూలమన్నారు. చక్కెర, ఉప్పు ఎంత తక్కువ వాడితే అంత మంచిదన్నారు. కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండడంతో పాటు చిరు ధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ధ్యానం, యోగా ప్రతి నిత్యం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటామన్నారు. బరువు తగ్గింపుపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. మధుమేహం, హైపర్ టెన్షన్, డిస్లిపిడేమియా వంటి ప్రమాద కారకాల బారిన పడినవారు వాటిని అదుపులో ఉంచుకోవడం తప్పనిసరన్నారు. వయస్సుకు తగ్గ విశ్రాంతి తీసుకోవడం వల్ల అనేక రోగాలకు చెక్ పెట్టవచ్చన్నారు. బీసీ నాయకుడు కందుకూరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మండల పూజ

తాండూరు, డిసెంబర్ 26: తాండూరు శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం మండల పూజ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజా, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు వందలాది సంఖ్యలో పాల్గొన్నారు. తాండూరు మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన రమేశ్ గురుస్వామి అయ్యప్ప స్వామి మూల విరాట్ విగ్రహంకు రూ.2 లక్షల 50 వేలతో వెండి తొడుగును చేయించి బహూకరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు మనోజ్ గౌడ్, కార్యదర్శి బాకారం జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందిస్తే చూపు పదిలం

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కొడంగల్ లయన్స్ క్లబ్ సభ్యులు

కొడంగల్, డిసెంబర్ 26: కంటి చూపుపై అశ్రద్ధ వహించవద్దని, సకాలంలో వైద్యం అందిస్తే చూపు పదిలంగా ఉంటుందని కంటి వైద్య నిపుణుడు లయన్ హరినాథ్‌నెహ్రూ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రి, కొడంగల్ లయన్స్ క్లబ్ తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపులో మొత్తం 32 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 19 మందికి కంటి శుక్లాల సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరిని లయన్ కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రోగులకు పండ్లు, బిస్కెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు దాసప్ప యాదవ్, అశోక్‌కుమార్ కులకర్ణి. శ్రీనివాస్‌గౌడ్, భీమరాజు పాల్గొన్నారు.

84 మందికి ఉచిత కంటి పరీక్షలు..



కంటి పరీక్షలకు హాజరైన రోగులతో వైద్య సిబ్బంది

దోమ, డిసెంబర్ 26 : జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కుల్కచర్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి శిబిరం నిర్వ హించినట్లు డాక్టర్ వాజియుద్దీన్ తెలిపారు. ఈ శిబిరంలో 84 మందికి కంటి పరీక్షలు నిర్వ హించగా అందులో 42 మంది శుక్లాల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి బీపీ, షుగర్ పరీక్షలు చేయగా 23 మందికి వాటి తీవ్రత ఎక్కువగా ఉండటంతో మందులు అందజేశామన్నారు. మిగతా 19 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి రెఫర్ చేసి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణుడు జవహర్‌లాల్, ఏఎన్ఎం సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కుంచావరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాలు

బంట్వారం, డిసెంబర్ 26: అంబేద్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గంలో నుంచి బర్తరఫ్ చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు రమేశ్, రాజు, రఘువీర్, అశోక్, బాల్‌రాజ్, మల్లేశ్ తదితరులు డిమాండ్ చేశారు. గురువారం మండల సరిహద్దులోని కుంచావరంలో వివిధ గ్రామాల దళిత సంఘాల ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు సభలో అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడిపై చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. మంత్రి వర్గంలోనుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ..

సీపీఐ జెండావిష్కరణలో డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్, జిల్లా నాయకుడు వెంకటేశ్

పరిగి, డిసెంబర్ 26 : సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పరిగిలో పార్టీ జెండాను పార్టీ డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్, వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ ఎగురవేశారు. పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా ఈనెల 30వ తేదీన నల్లగొండలో జరిగే పార్టీ ఆవిర్భావ కార్యక్రమాలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. నిరంతరం పేదల పక్షాన పోరాడతామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, యాదయ్య, రాంచెంద్రయ్య, బసప్ప, రాములు, మల్లేశ్, యాదగిరి, రామయ్య, శేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

వెంకట్ రమణ రెడ్డి (ఫైల్)

శేరిలింగంపల్లి, డిసెంబర్ 26 : ఔటర్ సర్వీస్‌రోడ్డుపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందాడు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 22న రాత్రి 1.30 గంటలకు నానక్‌రాంగూడ టోల్‌గేట్ సమీపంలో ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్‌రోడ్డుపై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వెంకటరమణారెడ్డి(26), బీటెక్ విద్యార్థిని శివానీలు బైక్‌పై వెళ్తుండగా వేగంగా వచ్చిన స్కోడాకారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివానీ అక్కడికక్కడే మృతి చెందగా వెంకటరమణారెడ్డికి తీవ్ర గాయాలు కాగా.. మదీనగూడలో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడిది కామారెడ్డి నిజాంసాగర్. ఈ మేరకు పోలీసులు వెంకటరమణారెడ్డి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి.. కేసు దర్యాప్తు చేపడుతున్నారు. కాగా వేగంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన నగరంలోని ఓ ప్రముఖ డాక్టర్ కుమారుడు శ్రీకాలేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

హుక్కా సెంటర్‌పై దాడి.. నలుగురి అరెస్ట్

సైదాబాద్, డిసెంబర్ 26: మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా కొనసాగుతున్న హుక్కా సెంటర్‌పై స్థానిక పోలీసులు దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేశారు. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం... మలక్‌పేట పీవీఆర్ మాల్ సమీపంలో కేఫ్ బ్లాక్ స్పాట్ పేరుతో అక్రమంగా హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఆ సెంటర్‌పై దాడి చేశారు. బిహార్ రాష్ట్రానికి చెందిన చోటిపాలిలో నిషేధించిన హుక్కా పదార్థాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సెంటర్ నలుగురు నిర్వాహకులు మహ్మద్ అజీమ్, ఎతేషామ్ మెహదీ, అజాన్ మోహదీ, అస్లాం హల్ఖోర్‌లను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి హుక్కా సామగ్రిని స్వాధీన పర్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



తెలుగు మలేషియా సంఘంతో పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఒప్పందాన్ని కుదుర్చుకున్న సందర్భంగా వీసీ నిత్యాందరావు, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు

మలేషియా తెలుగు సంఘంతో ఒప్పందం

- తెలుగు భాషకు, సంస్కృతికి మలేషియాలో పెద్దపీట
- మలేషియా పర్యటనలో తెలుగు వర్సిటీ వీసీ నిత్యానందరావు, రిజిస్ట్రార్ హనుమంతరావు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 26: మలేషియాలో స్థిరపడిన తెలుగు ప్రజలు ఆర్థికంగా, విద్యాత్మకంగా, సంఘటితశక్తిగా ఎదిగి బలమైన వర్గంగా రూపుదాల్చడం హర్షించదగిన విషయమని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు అన్నారు. మలేషియాలోని రవాంగ్ పట్టణంలో జరిగిన సమావేశంలో తెలుగు మలేషియా సంఘం(టీఏఎం)తో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విద్యాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వీసీ నిత్యానందరావు గురువారం తెలిపారు. తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావుతో మలేషియా పర్యటనలోఉన్న నిత్యానందరావు మాట్లాడుతూ.. ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి నాలుగు తరాల క్రితం బతుకుదెరువు కోసం మలేషియాకు వలసవెళ్లి స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మూలాలను గుర్తుంచుకుంటూ తెలుగు భాష పోతే తెలుగు అస్థిత్వం పోయినట్లే అన్న ఆవేదనతో మదిని సోమనాయుడు, డీవీ శ్రీరాములు, అప్పల నాయుడు చేసిన కృషిని వారు ప్రశంసించారు. ప్రసిద్ధ వైద్యులు అచ్చయ్యకుమార్ నేతృత్వంలో తెలుగు అకాడమీ పేరుతో విశాల భవన సముదాయాన్ని నిర్మించారని తెలిపారు. ఆ భవనంలో తెలుగు సంస్కృతి ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా పండుగలు, సమ్మేళనాలు, సమావేశాలు చేపట్టడం హర్షించదగిన విషయమన్నారు. నూతన తరానికి తెలుగు భాష నేర్పడంతెలుగుప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవడంలో తెలుగు విశ్వవిద్యాలయంతో చేసుకున్న ఒప్పందం ఎంతగానో తోడ్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు భాషలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లోమా కోర్సులకు ఒక సంవత్సరానికి పరిమితం కాకుండా ఏకంగా నాలుగు ఏళ్ళపాటు ఒప్పందం చేసుకోవడం జరిగిందని.. ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. తెలుగు మలేషియా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకట ప్రతాప్, ఉపాధ్యక్షులు సత్తయ్య, సుధాకర్‌నాయుడు, సురేశ్ నాయుడు, ప్రముఖ వైద్యులు అచ్చయ్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ బ్యాంకులన్నీ

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం

వివరాలు వెల్లడిస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ వై.శోభ

- బ్యాంకింగ్ సేవలకు 28 నుంచి 31 వరకు అంతరాయం
- ఏపీజీవీబీ పాత చెక్కులు, డీడీలు 31 వరకు చెల్లింపులకు అవకాశం
- వివరాలు వెల్లడించిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభ

అంబర్‌పేట, డిసెంబర్ 26: వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి తెలంగాణలో ఉన్న ఏపీజీవీబీ బ్యాంకు శాఖలన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనమవుతున్నాయని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ వై.శోభ తెలిపారు. గ్రామీణ బ్యాంకులను పటిష్టపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక రాష్ట్రం-ఒక గ్రామీణ బ్యాంకు అనే ప్రతిపాదనను తీసుకొచ్చిందన్నారు.ఈ మేరకు గురువారం నల్లకుంటలోని బ్యాంకు కేంద్ర కార్యాలయంలో జీఎం ఆపరేషన్స్ తమ్మన సుధాకర్, జీఎం అడ్మిన్ టి.చంద్రశేఖర్, జీఎం ఐటీ కె.లక్ష్మి, జీఎం విజిలెన్స్ టి.భారతి తయార్, జీఎం కంప్లీయన్స్ డి.రమేశ్, ఏజీఎం పర్సనల్ సుశాంత్‌కుమార్‌తో కలిసి చైర్మన్ శోభ విలీననానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు అందిస్తున్నదన్నారు. ఏపీజీవీబీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం 771 శాఖల్లో సేవలందిస్తున్నదని చెప్పారు. విలీనం తర్వాత తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం 435 శాఖలతో రూ.30వేల కోట్ల వ్యాపారం కలిగి 18 జిల్లాల్లో సేవలందిస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు.. విలీనం తర్వాత 928 శాఖలు, రూ.70వేల కోట్ల వ్యాపారం విలువ కలిగి దేశంలోని అతి పెద్ద గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా నిలువనుందని పేర్కొన్నారు. విలీనం కారణంగా బ్యాంకు కార్యకలాపాలు, ఆన్‌లైన్ సేవలైన యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఖాతాదారుల సేవా కేంద్రాల్లో లభించే అన్ని బ్యాంకింగ్ సేవలకు ఈ నెల 28 నుంచి 31 వరకు అంతరాయం కలుగుతుందని, ఖాతాదారులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నామన్నారు. అయితే ఖాతాదారుల అవసరాల దృష్ట్యా ఈ నెల 30, 31వ తేదీల్లో అత్యవసర పరిస్థితుల్లో రూ.5వేల వరకు నగదు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నామని వెల్లడించారు. జనవరి ఒకటో తేదీ నుంచి తిరిగి అన్ని రకాల సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏపీజీవీబీ శాఖలకు చెందిన ఖాతాదారులు వారి ఏటీఎం కార్డులు మార్చుకొనుటకు, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవల్లో తిరిగి నమోదు చేసుకొనుటకు జనవరి ఒకటో తేదీ నుంచి వారి బ్యాంకులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మొబైల్ బ్యాంకింగ్ ఖాతాదారులు ప్లేస్టోర్ లేదా ఆపిల్ స్టోర్ నుంచి మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవల కోసం బ్యాంకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఏపీజీవీబీ ఖాతాదారుల వద్ద ఇప్పటికే ఉన్న పాత చెక్కులు, డీడీలు ఈ నెల 31 వరకు చెల్లింపులకు క్లియరింగ్ సేవలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. చెక్ బుక్ ఉన్న ఏపీజీవీబీ ఖాతాదారులు వారి చిరునామాకు నూతన చెక్ బుక్కులు పోస్టు ద్వారా పంపబడతాయని, వీటిని జనవరి ఒకటో తేదీ నుంచి వినియోగించుకోవచ్చన్నారు.